andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.7, కనిష్ఠం 20.9
నిర్మల్
జిల్లా వార్తలు
6
గురువారం 18 జనవరి 2024



రేపు మార్కెటింగ్, ఎగ్జిక్యూటివ్ ఉద్యోగమేళా

ముథోల్, జనవరి 17 : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం నందు ఉద్యోగమేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి జి. రాములు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పనిచేయుటకు పేటీఎంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయన్నారు. విద్యార్హత ఎస్ఎస్‌సీ పాస్, ఆపైన ఇంటర్, డిగ్రీ ఎంబీఏ పూర్తి చేసి ఉండాలన్నారు. వయస్సు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు లోబడి ఉండాలని పేర్కొన్నారు. వేతనం రూ.15,500 నుంచి రూ. 21,000 వరకు ఉంటుందని వివరించారు.

సీఎంఆర్ రికవరీపై గడువు పెంపు



ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

- ఈ నెల 31 వరకు చివరి అవకాశం
- ఇప్పటికే పలుసార్లు గడువు పెంచినా పూర్తికాని రికవరీ
- కొత్త సర్కారు తీసుకునే చర్యలపైనే అంతటా ఆసక్తి

నిర్మల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీఎంఆర్ బియ్యం రికవరీ గడువును పౌరసరఫరాలశాఖ అధికారులు మరోసారి పెంచారు. గత సంవత్సరం డిసెంబరు 31 వరకు మొదట సీఎంఆర్ బియ్యం రికవరీకి సంబంధించిన గడువును విధించినప్పటికీ ఆ గడువులోగా రైస్‌మిల్లర్లు బియ్యాన్ని సంబంధిత శాఖ అధికారులకు తిరిగి ఇవ్వలేదు. గడువును ఓ నెలరోజుల పాటు పెంచాలంటూ రైస్‌మిల్లర్ల యాజమాన్యాలు ప్రభుత్వంను కోరడంతో సర్కారు మరోసారి ఈ గడువును పెంచింది. అయితే ఈ గడువులోగా రైస్‌మిల్లర్లు గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు తిరిగి ఇస్తారో లేదోనన్న సందేహాలు నెలకొంటున్నాయి. గత ఏడాది నుంచి సీఎంఆర్ బియ్యం రికవరీ విషయంలో అయోమయ పరిస్థితులు కొనసాగుతున్నాయి. 2022-2023 సంవత్సరం ఖరీఫ్, రబీసీజన్‌కు సంబంధించి సీఎంఆర్ బియ్యం విషయంలో ఇప్పటికి గందరగోళం తొలగడం లేదు. సీఎంఆర్ బియ్యం విషయంలో సంబంధిత పౌరసరఫరాలశాఖ అధికారులు ఇప్పటికే పలుసార్లు రైస్‌మిల్లర్లకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆ హెచ్చరికలన్నీ బేఖాతరయ్యాయన్న విమర్శలున్నాయి. అధికారుల నిర్వాహకం, అలాగే సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సిన రైస్‌మిల్లర్లు తమకున్న పలుకుబడి కారణంగా దాదాపు మూడు నాలుగు ఏళ్ల నుంచి ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. కాగా గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా వ్యవహరించిన రైస్‌మిల్లర్లపై ఈ సారి మాత్రం కొత్త సర్కారు ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న చర్చ మొదలైంది. కాగా ప్రస్తుతం జిల్లాలో మొత్తం 77 రైస్‌మిల్లులు ఉండగా ఇందులో నుంచి 12 బాయిల్డ్ రైస్‌మిల్లులు, 65 రా రైస్‌మిల్లులున్నాయి. 2022-2023 ఖరీఫ్‌సీజన్‌లో మొత్తం 56 రైస్‌మిల్లులకు 1,68,177 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం కేటాయించారు. ఇందులో నుంచి రైస్‌మిల్లర్లు 1,12, 838 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాలశాఖకు మిల్లింగ్ చేసి ఇవ్వాల్సి ఉంది. అయితే ఏడాది గడుస్తున్నా మొదటి సంవత్సరం వరకు కేవలం రైస్‌మిల్లర్లు 53,929 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే పౌరసరఫరాలశాఖకు అప్పగించారు. మరో 58,908 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యంను సంబంధిత శాఖకు మొదటి గడువులోగా అప్పగించారు. మిగతా సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే తిరిగి ఇవ్వాలంటూ సంబంధిత శాఖ అధికారులు రైస్‌మిల్లర్లకు పలుసార్లు గడువు విధించారు. మిల్లర్లు మాత్రం మొత్తం సీఎంఆర్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇవ్వలేదు. దీంతో సంబంధిత శాఖ అధికారులు కేవలం గడువు పొడగింపుకే ప్రాధాన్యతనిస్తూ రికవరీ విషయంలో పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఈ వ్యవహారం ఇలా కొనసాగుతుండగానే 2022-2023 సంవత్సరానికి సంబంధించిన యాసంగి సీజన్‌లో మొత్తం రైస్‌మిల్లర్లకు సీఎంఆర్ కోసం 1,58,566 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ కోసం కేటాయించారు. దీని ప్రకారం రైస్‌మిల్లర్లు 1,06,044 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం పౌర సర



ఫరాలశాఖకు ఇవ్వాలంటూ ఆదేశించింది. అయితే ఈ నేపథ్యంలోనే 2023-2024 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని కూడా సీఎంఆర్ కోసం మళ్లీ రైస్‌మిల్లులు కేటాయించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. గత రెండు సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యమే ఇప్పటి వరకు రికవరీ కానప్పటికీ మళ్లీ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం ఇవ్వడం చర్చకు తావిస్తోందంటున్నారు.

ఈసారి గడువులోగానైనా రికవరీ పూర్తయ్యేనా ?

ఈ నెల 31లోగా గత ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని రైస్‌మిల్లర్లు పౌర సరఫరాల శాఖకు ఇవ్వాలంటూ ఆదేశాలు వెలువడ్డాయి. అయితే ఏడాది నుండి రికవరీ కానీ ఈ సీఎంఆర్ బియ్యం కేవలం 22 రోజుల్లోగా రికవరీ కావడం సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ ఖరీఫ్ సీజన్ ధాన్యం తరలింపుతో రైస్ మిల్లులన్నీ కిటకిటలాడుతుండగా గత ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని రైస్ మిల్లు యాజమాన్యాలు ఎలా తిరిగి ఇస్తాయోనన్న అనుమానాలు వెలువడుతున్నాయి. కాగా మరోసారి గడువును పెంచినప్పటికీ రికవరీ విషయంపై అంతటా సందేహాలు కొనసాగుతున్నాయి.

కొత్త సర్కారు చర్యలపైనే అంతటా ఆసక్తి

గత ప్రభుత్వ హయాంలో రైస్‌మిల్లర్లు సీఎంఆర్ విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. గత మూడు నాలుగు ఏళ్ల నుంచి ప్రతీ ఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించిన ధాన్యం మిల్లింగ్ విషయంలోనూ సీఎంఆర్ బియ్యం రికవరీ విషయంలోనూ మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. గత ప్రభుత్వం రైస్‌మిల్లర్ల విషయంలో ఉదాసీన వైఖరి అవలంభించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రికవరీపై గడువు మీద గడువు పెంచింది తప్ప అప్పటి ప్రభుత్వం ఏ ఒక్క రైస్ మిల్లర్‌పై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేసిందంటున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎంఆర్ రికవరీ విషయంలో ఈసారి ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న ఆసక్తి అంతటా నెలకొంటుంది.

నాలుగేళ్ల నుంచి ఇదే ఒరవడి

2021-2022 నుంచి ప్రతీఖరీఫ్, రబీసీజన్‌లలో సీఎంఆర్ ధాన్యం విషయంలో రైస్‌మిల్లుల యజమానులు పథకం ప్రకారం వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 2021-2022 యాసంగికి సంబంధించి భైంసా మండలం దేగాంకు చెందిన ఓ రైస్‌మిల్లు ప్రభుత్వానికి 3856 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ బియ్యాన్ని మిల్లు యాజమాన్యం తిరిగి ఇవ్వలేదు. 2022-2023 సంవత్సర ఖరీఫ్‌కు సంబంధించి 58 రైస్‌మిల్లులకు 1,68,177 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించగా మిల్లింగ్ అనంతరం రైస్‌మిల్లులు 1,12,919 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాలి. అయితే ఇప్పటి వరకు కేవలం 69,886 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చిన రైస్‌మిల్లులు ఇంకా 43,032 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. 2022-2023 యాసంగికి సంబంధించి జిల్లాలో 47 రైస్‌మిల్లులు 1,06,831 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 2770 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చాయి. ఇంకా 1,04, 061 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. 2023-2024 ఖరీఫ్‌కు సంబంధించి మొత్తం 69 రైస్‌మిల్లులకు 1,42,790 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కింద కేటాయించారు. అయితే రైస్‌మిల్లులు సీయంఆర్ బియ్యాన్ని ఈ నెల 31లోగా తిరిగి చెల్లించేందుకు ప్రభుత్వం గడువు పెంచింది. ఇప్పటి పరిస్థితిని పరిశీలిస్తే గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి ఇవ్వడం కష్ట సాధ్యమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైసు మిల్లులలో రెవెన్యూ అధికారుల తనిఖీలు



భైంసాలో రైస్‌మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

భైంసా, జనవరి 17 : డివిజన్ పరిధిలోని రైస్ మిల్లులలో బుధవారం రెవెన్యూ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భైంసా పట్టణ, మండల పరిధిలోని రైస్‌మిల్లులలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ రెవెన్యూ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వని రైస్ మిల్లులపై చర్యలు తీసుకునే క్రమంలో తనిఖీలకు ఉపక్రమించినట్లుగా సమాచారం. ఈ నెల 31 వరకు సీఎంఆర్ అప్పగించేందుకు ప్రభుత్వం గడువు పొడగించింది. దీంతో అప్పటి వరకు సీఎంఆర్ అప్పగించని రైస్‌మిల్లర్ల పై ఒత్తిడి తీసుకువచ్చి బియ్యం సేకరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టినట్లుగా తెలిసింది. ఇందులో భాగంగానే అన్ని ప్రాంతాల్లోని రైస్ మిల్లుల్లో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేస్తూ సీఎంఆర్ సేకరించే చర్యలను వేగవంతం చేసినట్లుగా తెలిసింది.

సినీ, టీవీ రంగాలపై ఔత్సాహికుల ఉచిత శిక్షణ

ముథోల్, జనవరి 17 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ తెలుగు టీవీ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో జనవరి 20న ఔత్సాహిక టీవీ రచయితలతో ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్మల్ జిల్లా తెలంగాణ మూవీ అండ్ టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కోఆర్డినేటర్ జున్ను అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ టీవీ సినీ దర్శకులు నాగబాల సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ శిబిరంలో ప్రముఖ సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య, ప్రముఖ రచయిత తోటపల్లి సాయినాథ్, యువ దర్శకులు దండనాయక్, స్క్రీన్‌ప్లే రచయిత శ్రీశైలంమూర్తి తదితరులు పాల్గొని శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. 24 శాఖలపై అవగాహన స్క్రీన్ ప్లే తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్నామని వివరించారు. పై వివరాల కోసం జిల్లా అధ్యక్షులు కొప్పుల చిన్న సెల్‌నెంబర్ 8008482758, ప్రధాన కార్యదర్శి దాసరి అంజయ్య సెల్ 9949166819, కోశాధికారి సామెర్ల రాజన్న 9490078392 జిల్లా కోఆర్డినేటర్ జే.అనిల్ 7396700178 నెంబర్లను సంప్రదించగలరని కోరారు.

దేవరకోట ఆలయంలో హుండీ లెక్కింపు



నిర్మల్ టౌన్, జనవరి 18 : లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయం దేవరకోటలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వచ్చిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి రంగు రవికిషన్‌గౌడ్, ప్రత్యేక అధికారి భూమయ్య ఆదిలాబాద్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేశారు. మూడు నెలల ఆదాయం రూ.మూడు లక్షల 18 వేల 53 వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ తెలిపారు.

భరోసా సెంటర్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముథోల్, జనవరి 17 : నిర్మల్ భరోసా సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో కోరారు. రిసెప్షనిస్ట్ (ఒక పోస్టు), సపోర్ట్ పర్సన్ (రెండు పోస్టులు), లీగల్ సపోర్ట్ పర్సన్ (ఒక పోస్టు), మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ ఏఎన్ఎం (ఒక పోస్టు)లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సర్వీస్ రెగ్యులరైజేషన్ హక్కులు లేకుండా కాంట్రాక్టు ప్రాతిపదికన తగిన పని చేసేందుకు అర్హులైన మహిళలు దరఖాస్తులు సమర్పించాలన్నారు. రిసెప్షనిస్ట్ కోసం టాలీ, అకౌంటింగ్ విభాగంలో అనుభవం 25 నుండి 35 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. సపోర్ట్ పర్సన్ కోసం సోషల్ వర్క్, చైల్డ్ డెవలప్‌మెంట్, మనస్తత్వ శాస్త్రాల్లో ఏదో ఒక దాంట్లో పీజీ, 25 నుండి 35 వయస్సు ఉండాలన్నారు. లీగల్ సపోర్ట్ కోసం ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎంలలో ఒక దాంట్లో పూర్తి చేసి ఉండాలని, పోక్సో అత్యాచార, కుటుంబ సలహాల విభాగంలో ఏదో ఒక దాంట్లో రెండేళ్ల అనుభవం ఉండాలని, 25 నుంచి 40 లోపు వయస్సు ఉండాలని సూచించారు. మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ ఖాళీ కోసం బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అర్హతతో పాటు గైనకాలజీ, పిల్లల వ్యాధులు, ఐసీయూ విభాగంలో అనుభవం ఉండాలని సూచించారు.

నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంస్థల ద్వారా కందుల కొనుగోలు

నిర్మల్ టౌన్, జనవరి 17 : జిల్లాలోని రైతులు పండించిన కందులను నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంస్థలు కొనుగోలు చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్‌లో కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కందుల కొనుగోలు కోసం నాఫెడ్, మార్క్ ఫెడ్ సంస్థల ద్వారా, ఏఎంసీ భైంసా, ఏఎంసీ నిర్మల్, ఏఎంసీ ఖానాపూర్, ఏఎంసీ కుభీర్ కొనుగోలు కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు చేయడానికి జిల్లా యంత్రాంగం అనుమతించిందన్నారు. జిల్లాలో 9,186 ఎకరాల్లో 18,352 మంది రైతులు కందులు పండించడం జరిగిందని వివరించారు. ధర స్థిరీకరణ పథకం ద్వారా రోజువారీగా కందుల ధర మార్కెట్ రేటు ప్రకారం నాఫెడ్ అధికారులు నిశ్చయించిన ధరకు పొందగలరని, రైతులు తాము పండించిన కందులను ఆరబెట్టి 12 శాతం తేమ ఉండేవిధంగా చూసుకొని, శుభ్రపరచుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాఫెడ్, మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మార్కెటింగ్ అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

ఎస్ఎఫ్‌సీ నిధులను వెంటనే విడుదల చేయాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన సర్పంచ్‌లు

నిర్మల్ టౌన్, జనవరి 17 : గత 18 నెలల నుంచి నిలిచిపోయిన ఎస్ఎఫ్‌సీ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సర్పంచ్‌లు బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ కుమార్ మాట్లాడుతూ... ఎస్ఎఫ్‌సీ నిధులు గ్రామ పంచాయతీలకు జమ కాకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అలాగే చెక్‌పవర్ త్వరగా ఇవ్వకపోవడంతో గత రెండున్నర సంవత్సరాలు తాము తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని పేర్కొన్నారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగియబోతున్నందున మరో ఆరు నెలల వరకు గడువు పెంచి ప్రత్యేక అధికారులను నియమించే ఆలోచనను విరమించుకోవాలని వారు కోరారు.

గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం బాధ్యులు భూమేష్, దత్తు, ముత్యం, బాపురెడ్డి, హన్మ గౌడ్, లక్ష్మి, సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తా

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, జనవరి 17: నియోజక వర్గ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి , సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ వెల్లడించారు. బుధవారం భైంసా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంఘం సభ్యులు పెర్కొన్న ప్రభుత్వ గుర్తింపు అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరింప చేసేందుకు బాధ్యతాయుతగా పాటుపడుతానని పెర్కొన్నారు. పెండింగ్‌లోన్ను ఏరియర్స్, డీఏల చెల్లింపుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి చెల్లింపులు జరిగేలా చూస్తానని పెర్కొన్నారు. ఇదే క్రమంలో కార్పోరేట్ , ప్రైవేట్ ఆసుపత్రుల్లో హెల్త్‌కార్డుల ద్వారా వైద్య సేవలు అందింప చేసే విషయాన్ని సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి న్యాయం చేస్తానని పెర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరింప చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానని వివరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ ను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఇందులో భైంసా డివిజన్ ట్రేజరి అధికారి నజీమ్, భైంసా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బి.నాగ్‌నాథ్, అసోసియేట్ అధ్యక్షులు ఎస్.మానిక్‌రావ్, కార్యదర్శి ఎస్.భాస్కర్‌రావ్, భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.దామోదర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

అక్రమ డీ-1 పట్టాలను రద్దు చేయాలి

- న్యూ సాంగ్వి గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యూ సాంగ్వి గ్రామస్థులు

మామడ, జనవరి 17 : మండలంలోని పలు గ్రామాల్లో అక్రమార్కులు డీ-1 పట్టాల పేరుతో భూ నిర్వాసితుల భూములను కొట్టేయడానికి ప్రైవేట్ సర్వేయర్‌లతో భూమి కొలతలను తీయించి అక్రమ పట్టాలను సృష్టిస్తున్నారని న్యూ సాంగ్వి గ్రామానికి చెందిన గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన కొందరు వ్యక్తులు కొందరు రాజకీయ నాయకుల అండదండలతో తమ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అక్రమ డీ-1 పట్టా సృష్టించి పేదల భూములకు కాజేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి అక్రమ డీ-1 పట్టాలను రద్దు చేయాలని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కు వినతి పత్రం అందజేశారు. కొందరు వ్యక్తులు ప్రైవేట్ సర్వేయర్‌లతో సర్వే నిర్వహించి కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బుధవారం ఒక ప్రైవేట్ సర్వేయర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించామని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, న్యూ సాంగ్వి సర్పంచ్ భర్త శ్రీనివాస్‌గౌడ్, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న విద్యార్థులు

మామడ, జనవరి 17 : విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరు వేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. మండలంలోని పొన్కల్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 29 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగడతామంటూ చర్చించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆప్యాయంగా పలకరించి సన్మానించారు. తమ విద్య వైవాహిక, ఉద్యోగ, జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల గురించి ఒకరినొకరు చెప్పుకుంటూ సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహలతో గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రాధాకిషన్, కులశేఖర్, మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య, హనుమంత్‌రెడ్డి, కనకాంబ, రామారావు, రమేష్, రాజయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

మున్సిపాలిటీలో అదనపు కలెక్టర్ తనిఖీ



ఫైళ్లను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 17 : నిర్మల్ మున్సిపాలిటీని బుధవారం అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా పలు ఫైళ్లను తనిఖీ చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టే పనులపై చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ రాజును అడిగి తెలుసుకున్నారు.

ఓట్ ఈజ్ యువర్ రైట్ ఓట్ ఫర్ బెటర్ ఇండియా



లక్ష్మణచాందలో 2కె రన్‌లో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు

లక్ష్మణచాంద, జనవరి 17 : ఓట్ ఈజ్ యువర్ రైట్ - ఓట్ ఫర్ బెటర్ ఇండియా అంటూ బుధ వారం మండల కేంద్రమైన లక్ష్మణచాందలో నినదించారు. సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) క్యాలెండర్‌లో భాగంగా మండల ప్రధాన రహదారి వెంట 2కె రన్ నిర్వ హించారు. పార్లమెంటరీ ప్రభుత్వంలో ఓటు ప్రాధాన్యత గురించి, ఓటు వేయటం వలన జరిగే ప్రయో జనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ వి. గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, వరల్డ్ విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజర్ బ్రహ్మయ్య, రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)లు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులను నిలిపివేయాలి

- మండల పంచాయతీ అధికారికి ఫిర్యాదు

నర్సాపూర్(జి), జనవరి 17 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లేదని, చేసిన పనులకు సైతం రెండవసారి పనులు చేసినట్లు ఎంబీలను సృష్టించి పంచాయతీ నిధులను మాయం చేస్తున్నారని మండల కేంద్రానికి చెందిన గాదె సంతోష్, మహమ్మద్ అజీమ్ మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి వీణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీలో చేయలేని పనులకు చేసినట్లు ఎక్కువ మొత్తంలో ఎంబీల రూపంలో రికార్డు చేయించి ప్రభుత్వ సొమ్మును కాజేసే ప్రయత్నం చేస్తున్న వారిని అడ్డుకోవాలని, సెంట్రల్ లైటింగ్‌కు అనుగుణంగా ఉన్న గ్రీనరీ దానికి ప్రహరీగా పెడుతున్న కంచెకు సంబంధించి వివిధ పనులకు చేసే దానికంటే ఎక్కువ ఎంబీల రికార్డు చేయించి ప్రభుత్వ ఖజానా కాజేసే విదంగా కొందరు స్థానిక ప్రజా ప్రతినిదులు ప్రయత్నిస్తున్నారని స్థానిక పంచాయతీరాజ్ శాఖా అసిస్టెంట్ ఇంజనీర్ సూర్యతేజగౌడ్ ఎక్కువ మొత్తం ఎంబీలు రికార్డు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టి చెక్కులను నిలిపి వేయాలన్నారు.

ఆదిలాబాద్‌లో రైతు ఆత్మహత్య

● తన పొలానికి తోటి రైతులు దారి ఇవ్వకపోవడంతోనే..

● మృతుడి కుటుంబీకుల ఆందోళన

నేరడిగొండ, జనవరి 17 : తన పొలానికి వెళ్లేందుకు తోటి రైతులు దారి ఇవ్వడం లేదనే మనోవేదనతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామానికి చెందిన రైతు రమణారెడ్డి (45) తనకున్న మూడు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతని పొలం పక్కనే గ్రామానికి చెందిన బాణాల రమేష్, ఏలేటి శ్రీనివాస్ వ్యవసాయ భూములు ఉన్నాయి. అయితే రమణారెడ్డి తన పొలానికి వెళ్లకుండా బాణాల రమేష్, ఏలేటి శ్రీనివాస్‌లు తమ పొలం నుంచి దారిని మూసేశారు. ఈ విషయమై ఇటీవల ఇరు వర్గాల మధ్యఘర్షణ చోటుచేసుకుంది. అయినా రమేష్, ఏలేటి శ్రీనివాస్‌లు రమణారెడ్డి పొలానికి దారి ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. దీంతో మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు.. తన చావుకు రమేష్, ఏలేటి శ్రీనివాస్‌లే కారణమని రమణారెడ్డి లేఖ రాసి.. బుధవారం తన చేనులో పురుగుల మందు తాగి సూసైడ్ చేసుకున్నాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మృతుడి కుటుంబ సభ్యులు.. రమేష్, ఏలేటి శ్రీనివాస్‌ల ఇంటి ఎదుట రమణారెడ్డి మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు చేయబోమని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఏఎస్పై మారుతి ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను సముదాయించారు. ఆత్మహత్యకు కారకులైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఏఎస్పై హామీ ఇవ్వడంతో.. మృతుడి కుటుంబీకులు ఆందోళన విరమించారు.

సాలెవాడలో ప్రారంభమైన మహాదేవ్ జాతర

ఉట్నూర్, జనవరి 17: మండలంలోని సాలెవాడలో వెలసిన మహాదేవ్ ఆలయం ఆవరణలో జాతర బుధవారం ప్రారంభమైంది. సాలెవాడ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పూజలు ప్రారంభించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు సల్‌గారే రవీందర్ ఆధ్వర్యంలో పూజలు ప్రారంభించారు. జాతరలో క్రికెట్ పోటీలతోపాటు కబడ్డీ, కుస్తిపోటీలు నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు.

వడ్డాదిలో ముగిసిన సప్తాహ

తాంసి, జనవరి 17: మండలంలోని వడ్డాది గ్రామంలో గత 7రోజుల పాటు నిర్వహించిన బాజీరావుబాబా సప్తహ బుధవారంతో ముగిసింది. జిల్లానలుమూలల నుంచి కాకుండా పక్కనఉన్న మహారాష్ట్ర నుంచి వందలాది మంది బాజీరావు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

రైల్వే సాధన కమిటీ రిలే దీక్షలకు సంఘీభావం

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి17: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్‌ఏర్పాటు ఈ ప్రాంత వాసుల దశాబ్ధాల కల అని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానికుల సమస్యల పరిష్కారం తను సైతం తోడుంటానని, ఈ సమస్యను ప్రభుత్వం తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. దీక్షాశిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయనవెంట డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుందతివెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టుల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్త్‌కు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సోహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్.దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్న సాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్తూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్టు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజిత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్జాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెంబర్ 66లో 2009-10 పహణి ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్ల పాలన సాగించడం అరుదని, ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!


(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.



- కాంగ్రెస్, బీజేపీ పార్టీలలో పోటాపోటీ
- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి మార్పుపై ఊహాగానాలు
- పార్లమెంట్ ఎన్నికలకు ముందే పార్టీ పదవులు
- అధిష్ఠానం నిర్ణయంపై ఆశగా ఎదురు చూస్తున్న నేతలు

అధ్యక్ష పీఠంపై గురి!





ఆదిలాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. నిన్నమొన్నటి వరకు ఓ పార్టీలో కొనసాగిన నేతలు ప్రస్తుతం మరో పార్టీ కండువా కప్పుకుని చెలామణి అవుతున్నారు. అధికారానికి దూరమైన బీఆర్‌ఎస్ కొంత డీలాపడినా కాంగ్రెస్ మంచిజోష్‌తో కన్పిస్తోంది. జిల్లాలో మూడు ప్రధాన పార్టీలు ఎన్నికల్లో గెలుపు కోసం హోరాహోరీ ఫైట్ చేసిన బీఆర్‌ఎస్, బీజేపీలకే ఫలితం దక్కింది. ఆదిలాబాద్‌లో కాషాయ జెండాను ఎగురవేయగా బోథ్‌లో కారుదే జోరు కన్పించింది. రెండుచోట్ల కాంగ్రెస్ పార్టీ వెనుకబడింది. కానీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలదే హవా కన్పిస్తోంది. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌పై పార్టీ సస్పెన్షన్ వేటు వేయడంతో ఆ పదవి ఖాళీగానే కన్పిస్తోంది. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ప్రస్తుతం ఆ పార్టీ అధ్యక్ష పీఠం ఖాళీగానే మారింది. బీఆర్‌ఎస్ అధ్యక్షుడి మార్పుపై భిన్నా భిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రధానపార్టీల అధ్యక్ష పీఠాల పై ఆశావహ నేతలు గురిపెట్టారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పార్టీ పెద్దలతో టచ్‌లో ఉంటున్న పలువురు ఆశావహ నేతలు లాబీయింగ్ చేస్తున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రధానపార్టీల అధిష్ఠానం నిర్ణయం కోసం ఆశావహ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కాంగ్రెస్‌లో ముగ్గురు పోటీ

కాంగ్రెస్ పార్టీలో ప్రధానంగా ముగ్గురు నేతల పేర్లు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లతోపాటు తలమడుగు మండల జడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి పేర్లను పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులకే ప్రాధాన్యత ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకేంద్రంలో అందుబాటులో ఉండే నేతలకే ఎక్కువ అవకాశాలు ఉంటాయని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆర్థికంగా బలమైన నేత పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ల గలిగే కంది శ్రీనివాస్‌రెడ్డివైపే పార్టీ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. గతంలో మైనార్టీ నేతకు అవకాశం ఇవ్వడంతో ఈసారి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతకు అవకాశం దక్కేలా కన్పిస్తోంది. దాదాపుగా కంది శ్రీనివాస్‌రెడ్డి పేరు ఖరారైనట్లుగానే ప్రచారం జరుగుతోంది.

ఎమ్మెల్యే మద్దతు ఉంటేనే..

బీజేపీ అధ్యక్షడి పోటీలో పలువురు నేతలు ఉన్న స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ మద్దతు ఉన్న వారికే పార్టీ అధ్యక్ష పదవి దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లోక ప్రవీణ్‌రెడ్డి, సుహాసిని రెడ్డి, ఆదినాథ్, ఎండ్రాల నగేష్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. బోథ్ నియోజకవర్గం నుంచి మరోనేత సాకటి దశరథ్ పదవిని ఆశిస్తున్న ఆదిలాబాద్ నియోజకవర్గానికి చెందిన నేతలకే ఎక్కువ అవకాశాలు కన్పిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్‌ను ఆశించిన దక్కకపోవడంతో కొంత అసంతృప్తితో ఉన్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి అధ్యక్ష పదవిని ఆశిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్ మద్దతు కష్టమేనన్న అభిప్రాయాలు విన్పిస్తున్నాయి. పాయలశంకర్ గెలుపులో కీలకంగా వ్యవహరించిన లోక ప్రవీణ్‌రెడ్డి వైపే అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

మార్పు ఉంటుందా?

బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న జోగురామన్న ఈసారి ఓడిపోవడం ఆ పార్టీ కూడా రాష్ట్రంలో అధికారానికి దూరంకావడంతో కొంత గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది. అలాగే ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండే డీసీసీబీ చైర్మన్, మరికొంత మంది నేతలు ఇటీవలే పార్టీని వీడడంతో ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వచ్చే ఎన్నికల వరకు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అధిష్ఠానం చర్యలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల పార్లమెంట్‌స్థాయి నేతలతో సమావేశమైన అధిష్ఠానం పెద్దలు దిశానిర్దేశం కూడా చేశారు. ఇలాంటి పరి స్థితుల్లో అధ్యక్షుడి మార్పు ఉంటుందా లేక జోగు రామన్ననే కొనసాగిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇప్పటికే మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పవన్‌రావ్ ఇటీవలే మాజీమంత్రి కేటీఆర్‌ను కలిసి జిల్లా అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే పార్టీ అభ్యర్థులనే జిల్లాధ్యక్షుడిగా సాగించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి.

పార్లమెంట్‌పై ప్రత్యేక దృష్టి

ప్రధాన పార్టీలన్నీ రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాయి. త్వరలోనే జరిగే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నాయి. ఎన్నికల లోగా పార్టీ పదవుల నియమకాన్ని చేపట్టి జోష్‌ను ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఖాళీఅయిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలతోపాటు బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడి మార్పు ఉంటుందన్న ఊహాగానాలు విన్పిస్తున్నాయి. సమర్థవంతంగా ముందుకు నడిపే నేతలకే పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం ఉందంటున్నారు.

కన్నుల పండువగా స్వామి వారి కల్యాణం

భీంపూర్, జనవరి 17: మండలంలోని నిపాని గ్రామంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ భుగోధ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. అలివేలు మంగ సమేత శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణం మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. కల్యాణానికి ఆలయ వ్యవస్థాపకులు శ్రీశివదత్త గిరిమహరాజ్, కాంగ్రెస్ పార్టీ బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బీజేపీ జిల్లానాయకురాలు చిట్యాల సుహాసిని, తలమడుగు జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు అనిల్, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

భీంపూర్, జనవరి17: మండలంలోని నిపానిలో బుధవారం బోథ్ కాంగ్రెస్‌ఇన్‌చార్జి ఆడే గజేందర్ అధ్వర్యంలో నిపాని ఉపసర్పంచ్ జిట్ట ప్రణీత్ రెడ్డి తన 100మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

జిల్లా న్యాయాధికారులను కలిసిన ఎస్పీ

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి17: జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ గౌస్ ఆలం స్థానిక కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్, ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయాధికారి పి.శివరాంప్రసాద్‌లను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

'దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలి'

తాంసి, జనవరి17:మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వికలాంగు లందరికీ వర్తింపజేయాలని వికలాంగుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రత్నాకర్ కోరారు. బుధవారం సాయంత్రం మండలకేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు విద్యాధర్, ఆశన్న, ఎల్లన్న, తదితరులు ఉన్నారు.

అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహాపర్వాన్ని దీపావళిలా జరుపుకుందాం: ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 17: అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహాపర్వాన్ని దీపావళిలా జరుపుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. ఈనెల 22న భవ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ జరుగనుందని, దానికంటే ముందు పీఎం నరేంద్రమోదీ ఆలయాలను శుద్ధిచేయాలని పిలుపునిచ్చారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం సీసీఐ లోని అతిపురాతన రామాలయంలో శ్రమదానం చేశారు. పరిసరాలను పరిశుభ్రం చేయడంతోపాటు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ శ్రమదానంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని రామనామస్మరణతో భక్తిభావాన్నిచాటారు. పట్టణంలోని సీసీఐలో దాదాపు 50ఏళ్ల నాటి రామాయలంలో జీఎస్‌కమిటీ, సీసీఐ సహకారంతో అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో లాలామున్న, జోగురవి, ఆదినాథ్, రాళ్లబండి మహేందర్, అంకత్ రమేష్, సతీష్, కృష్ణ, సంతోష్, శివ, గోపిసురేందర్ పాల్గొన్నారు.



గౌరవ వందనం చేస్తున్న క్రీడాకారులు



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న బాలికలు



మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకట్‌నరసింహారెడ్డి

విద్యా, వికాసంపైనే ప్రభుత్వం దృష్టి

- డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి
- అట్టహాసంగా ఐఎస్ఎల్
- క్రీడల అభివృద్ధికి మరింత కృషి

ఉట్నూర్, జనవరి 17: రాష్ట్రంలోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి కృషి చేయడంతోపాటు విద్యా, వికాసానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకట్ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఈఎంఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్ఎల్) పోటీలను ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులందరూ ఆరోగ్యం ఉండడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ఇక్కడికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న క్రీడాకారులందరు విజేతలే అన్నారు. విద్యార్థి దశ నుంచి మంచి చెడు ఆటుపోట్లను సమానంగా తీసుకొని జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. ఈ క్రీడల్లో 17రకాల ఈవెంట్స్ ఉంటాయని 3వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు.

అట్టహాసంగా ప్రారంభమైన ఐఎస్ఎల్

రాష్ట్రంలో 7 సొసైటీల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలు ఉట్నూర్ మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో అటహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీ సోయంబాపురావ్‌తో పాటు ఇద్దరు ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, జాదవ్‌అనిల్‌తోపాటు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్, రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ చాహత్‌బాజ్‌పేయ్, మాజీ ఎంపీ గోడం నగేష్, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఎంపీపీ పంద్రజైవంతరావు హాజరై ఐఎస్ఎల్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీవో క్రాంతికుమార్, జిల్లాక్రీడల అధికారులు కోరెడ్డి పార్థసారథి, భుక్యా రమేష్, బండ జీవరత్నం, బెలూరి గోవర్ధన్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న సోయం బాపురావ్

క్రీడలకు కేంద్రం ప్రోత్సాహం: ఎంపీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్రంలో అధికారం చేపట్టాక క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తోందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. దీని వల్లే ఇప్పటివరకు దేశస్థాయిలోని కళాకారులు జాతీయ అంతర్జాతీయ ఒలంపిక్స్ క్రీడల్లో 200 పతకాలు సాధించారని అన్నారు. ఫిబ్రవరి మాసంలో జిల్లా స్థాయిలో సంసద్ ఖేల్ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. దేశవ్యాప్తంగా 75 పార్లమెంట్ నియోజకవర్గాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడానికి కేంద్రప్రభుత్వం ఖేల్ ఇండియా ద్వారా సంసద్ ఖేల్ ప్రోగ్రాంని ఏర్పాటు చేసిందని ఎంపీ సోయం బాపురావ్ వెల్లడించారు.



పరుగు పందెంలో వీరే విజేతలు..

ఉట్నూర్, జనవరి17: రాష్ట్రంలోని ఏడు సొసైటీలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలలో తొలిరోజు మహాత్మా జ్యోతిబాపూలే సొసైటీ విద్యార్థి బసంత్ ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సొసైటీ విద్యార్థి డి.సంతోష్, తృతీయస్థానంలో స్టార్ సొసైటీ విద్యార్థి సురేష్ నిలిచారు. అలాగే బాలికల విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన బాలికలు ఆర్.కీర్తన ప్రథమ, బి.మధుప్రియ ద్వితీయ, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన విద్యార్థిని ఆర్.నందిని తృతీయ స్థానంలో నిలిచారు. మొదటిరోజు విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎంపీ, ఎమ్మెల్యేలు మెమొంటోళ్లు అందించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడలు అధికారిపార్థసారథి,భుక్యారమేష్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులను గుర్తించాలి..

నాలుగురోజుల పాటు ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన ఐఎస్ఎల్ పోటీల్లో పాల్గొంటున్న ఉత్తమ క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు గుర్తించాలని ఈఎంఆర్ఎస్ కార్యదర్శి నవీన్ నికోలాస్ అన్నారు. 2015 నుంచి ఐఎస్ఎల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చదువులతోపాటు క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు ఐఐటీ, మెడిసిన్, నీట్‌లలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. మహాత్మాజ్యోతిబాపూలే సొసైటీ సెక్రటరీ మల్లయ్య బట్ మాట్లాడుతూ రాష్ట్రంలో 1022 గురుకులాలు ఉన్నాయని, 6.25 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు.

క్రీడలకు మరింత ప్రోత్సాహం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

క్రీడలను మరింత ప్రోత్సహానికి కృషిచేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు జాతీయస్థాయి క్రీడల్లో కూడా రాణిస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు చదువుకునే సమయాల్లో క్రికెట్ టోర్నమెంట్‌లు పెడుతూ విద్యార్థులు చదవకుండా చేస్తున్నారని జిల్లా పోలీసు అధికారులు ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ టోర్నమెంట్ల నిర్వహణకు అనుమతులు ఇవ్వవద్దని కోరారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో దశాబ్దాలుగా క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్నారని అన్నారు. బోథ్ ప్రాంతంలో కూడా రాష్ట్రస్థాయి క్రీడలు ఏర్పాటు చేసేలా గిరిజనసంక్షేమ శాఖ అధికారులు ఒక స్టేడియం మంజూరు చేయాలని అన్నారు. చదువు పట్ల ఏకాగ్రత ఇబ్బంది చేయడానికి క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు.



కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న బొజ్జుపటేల్

త్వరలో ప్రతీ ఇంటికి ఆరు గ్యారెంటీలు: ఎమ్మెల్యే

ఉట్నూర్, జనవరి 17: రాష్ట్రంలో పేదప్రజల ప్రభుత్వం ఏర్పాటైందని, త్వరలోనే ప్రతీ ఇంటికి ఆరు గ్యారెంటీలు అందిస్తామని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మండలకేంద్రంలోని మోబిన్‌పుర కాలనీలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఆఫీస్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్‌తో పాటు మైనార్టీ పెద్దలు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ను శాలువాతో సత్కరించారు. త్వరలో ఆరు గ్యారెంటీలు ప్రతీ ఇంటికి చేరుతాయన్నారు. పథకాల పేరిట ఎవరైనా ప్రజలను మోసం చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌సెట్ అభ్యర్థులతో ఉచిత సర్వీసు క్యాంపు

ఉట్నూర్, జనవరి 17: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ఉచిత సర్వీసు క్యాంపును నిర్వహించారు. ఆర్‌సెట్ డైరెక్టర్ కుమ్రలక్ష్మణ్ మాట్లాడుతూ గత 29రోజులుగా టూవీలర్ మెకానిజం శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో 36రోజుల శిక్షణ నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ఉచిత సర్వీసు క్యాంపు ఏర్పాటుచేసి అభ్యర్థుల శిక్షణను పరిశీలించినట్లు చెప్పారు. 25మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ఆశన్న, మల్లయ్య, సతీష్, షకీల్‌లు పాల్గొన్నారు.

అధికారం కోల్పోవడంతో రామన్నకు మతిభ్రమించింది: డీసీసీబీ చైర్మన్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 17: అధికారం కోల్పోయిన బాధలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మతి భ్రమించి మాట్లాడుతున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి మండిపడ్డారు. తాను డబ్బులు తీసుకొని కాంగ్రెస్‌లో చేరానని చేసిన వ్యాఖ్యలకు బుధవారం ప్రజాసేవాభవన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ పదవి, అధికారం కోల్పోవడంతో రామన్న మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయాల్లోకొచ్చే ముందు జోగురామన్న ఆస్తులెన్ని, తన ఆస్తులెన్నో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. అవినీతి చరిత్రను ఎపిసోడ్ల కొద్ది వివరిస్తామని చెప్పారు. అసలు జోగురామన్న రాజకీయాల్లోకి వచ్చిందే డబ్బు సంపాదన కోసమని, రిమ్స్‌లో అడ్డగోలుగా ఉద్యోగాలు అమ్ముకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. సహకార సంఘాల పదవులు పార్టీ గుర్తుతో కాదు.. రైతుల ఓట్లతో వచ్చినవన్నారు. జోగురామన్నకు దమ్ముంటే తమపై అవిశ్వాసం పెట్టాలన్నారు. అప్పట్లో రెండు కోట్లిస్తేనే టీఆర్‌ఎస్‌లో చేరుతానని కేసీఆర్‌ను డిమాండ్ చేసింది నిజం కాదా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జైనథ్‌జడ్పీటీసీ తుమ్మల అరుందతి వెంకట్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు జంగుపటేల్, భోజారెడ్డి, సీనియర్ నాయకులు మునిగెల విఠల్, సయ్యద్ సుజాత్‌అలీ, శ్రీనివాస్, ఎండీ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు చేయడం సరైంది కాదు: మున్సిపల్ చైర్మన్

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్న నానుడికి డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి నిదర్శనంగా నిలుస్తున్నారని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అన్నారు. డీసీసీబీ చైర్మన్ మాజీ మంత్రి జోగు రామన్నపై చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. అడ్డిభోజారెడ్డి తమ వ్యక్తిగత విషయాలు, కుటుంబం గురించి మాట్లాడడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు జరిగాయంటూ చేసిన ఆరోపణలను కొట్టిపడేశారు. తనకు డబ్బు మీద వ్యామోహం లేదన్న విషయాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. డీసీసీబీ చైర్మన్ చేసిన ఆరోపణలు రుజువు చేయాలని సవాల్ విసిరారు. అధికారం ఎన్నటికి శాశ్వతం కాదని, ఇకనైనా నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు. ఇందులో నాయకులు తదితరులు ఉన్నారు.



డైరెక్టర్‌కు మెమోరాండం అందిస్తున్న ఉద్యోగులు

దినసరి ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- డైరెక్టర్‌కు దినసరి ఉద్యోగుల వినతి

ఉట్నూర్, జనవరి 17: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు గురుకుల పాఠశాలలో, వసతి గృహాలలో పనిచేస్తున్న దినసరి ఉద్యోగులు, తాత్కాలికఉద్యోగులు, శానిటేషన్ వర్కర్ల వేతనాలను పెంచాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డికి జిల్లా గిరిజన సంక్షేమశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మెమోరాండం సమర్పించారు. బుధవారం ఉట్నూర్‌లో జరిగిన ఐఎస్ఎల్ ప్రారంభ కార్యక్రమానికి డైరెక్టర్ హాజరుకావడంతో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి వారి సమస్యలను వివరించారు. దినసరి ఉద్యోగుల వేతనాల బడ్జెట్‌ను ఏడాదికి కావాల్సిన మొత్తాన్ని ఒకేసారి కేటాయించాలని, మృతిచెందిన దినసరి ఉద్యోగులు నాలుగోతరగతి ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని, డిగ్రీ చదువుతున్న 4వ తరగతి ఉద్యోగులకు హాస్టల్‌వెల్ఫేర్ ఆఫీసర్ పదోన్నతులు ఇప్పించాలని తదితర డిమాండ్లను వివరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కేటీసీ నారాయణ, షౌకత్‌హుస్సేన్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు: ఎంపీపీ

బోథ్, జనవరి 17: దశలవారిగా గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ చెప్పారు. బుధవారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో రూ.4లక్షలతో నిర్మిస్తున్న మురికి కాలువ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులతో ఈ పనిని పూర్తి చేస్తామన్నారు. అంతేగాక కోటా(కె) గ్రామంలో పాఠశాల మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సర్పంచుల సంఘం అధ్యకులు శ్రీధర్‌రెడ్డి జన్మదిన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాట్నాపూర్ గ్రామ సర్పంచ్ పి.సుగుణ శంకర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరిచిన ప్రజాపాలన దరఖాస్తులు

ప్రజాపాలన దరఖాస్తులు పదిలం

బోథ్, జనవరి 17: ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేయిస్తున్నారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరిచారు. కొన్నిగ్రామాల్లో నుంచి వచ్చిన దరఖాస్తులకు ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులకు తేడారావడంతో బుధవారం గ్రామాల కార్యదర్శులను పిలిపించి లెక్కించారు. తక్కువ దరఖాస్తులు వస్తే పునఃపరిశీలించాలని కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు.